## వైద్య విద్యార్థులతో ఎందుకీ చెలగాటం?

**తెలంగాణ బిడ్డలకు నష్టం చేయాలన్నదే కాంగ్రెస్ వైఖరా?: కేటీఆర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): వైద్య విద్యను అభ్యసించాలని కోటి ఆశలు పెట్టుకున్న విద్యార్థుల జీవితాలతో ఏమిటీ చెలగాటం? అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు మండిపడ్డారు. రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లకు బ్రేకులు పడటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. అడ్మిషన్లను ఇంకెంత కాలం సాగదీస్తారని ఎక్స్‌వేదికగా ప్రశ్నించారు. 'తెలంగాణ బిడ్డలను నాన్‌లోకల్స్‌గా మార్చి ఇతర రాష్ట్రాల విద్యార్థులకు పెద్దపీట వేసే జీవో33 అమలుకు కాంగ్రెస్ సర్కారు ఎందుకు మొండిపట్టు పడుతున్నది? స్థానికతను నిర్ధారించే విషయాన్ని ఎందుకు వివాదస్పదం చేస్తున్నది? అడ్మిషన్ల ప్రక్రియను న్యాయపరమైన చిక్కుల్లోకి ఎందుకు నెడుతున్నది?' అని ట్వీట్ చేశారు. పిల్లలను డాక్టర్లుగా చూడాలని కలలుగంటున్న తల్లిదండ్రుల ఆకాంక్షలను దెబ్బతీసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్లను 8,915కు పెంచుకుని డాక్టర్ల ఫ్యాక్టరీగా తీర్చిదిద్దితే, ఆ సమున్నత లక్ష్యానికి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడుస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్ విజన్‌కు కాంగ్రెస్ సర్కారు వైఫల్యంతో గ్రహణం పట్టిందన్నారు.

**15వేలు ఇస్తామన్న జోకర్ పత్తాలేడు**

కేసీఆర్ రైతుబంధు కింద రూ.పదివేలు ఇస్తే, తాను రూ.పదిహేను వేలు ఇస్తానని చెప్పిన కాంగ్రెస్ జోకర్ ఎక్కడ? అని కేటీఆర్ ప్రశ్నించారు. వానకాలం సీజన్ ముగింపునకు ఇంకా 17 రోజులే మిగిలిందని, ఆ జోకర్ ఇప్పుడు పత్తాలేకుండా పోయారని విమర్శించారు.

**అదానీ విషయంలో ప్రపంచం కండ్లు తెరిచినా..**

అదానీ విషయంలో ప్రపంచం కండ్లు తెరిచినా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కండ్లు మూసుకునే ఉన్నాయని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అదానీకి సంబంధించి స్విట్జర్లాండ్ (స్విస్) 311 మిలియన్ డాలర్లను ఫ్రీజ్ చేసిందని ఉదహరించారు. ప్రపంచ దేశాల్లో అదానీ అవకతవకల వ్యవహారం వెలుగు చూస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఆయనతో అంటకాగుతున్నాయని మండిపడ్డారు. ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తూ క్రోనీ క్యాపిటలిస్టులను రక్షించడానికి ఇంకా ఎందుకు ఉత్సాహం చూపుతున్నారని ప్రశ్నించారు.



హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నివాసానికి వెళ్లి దాడి ఘటనను తెలుసుకుని పరామర్శిస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు

# రేవంత్‌కు సీఎంగా ఉండే అర్హత ఉందా?

- ఆయన చరిత్రహీన ముఖ్యమంత్రి
- హైదరాబాద్‌లో ఉన్న వాళ్లంతా మా వాళ్లే
- పదేండ్లలో ప్రాంతీయ విద్వేషం లేదు
- ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొడుతున్న సీఎం
- ఫిరాయింపుదారుల్లో హైకోర్టు వణుకు
- గాంధీ.. ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారు?
- కౌశిక్‌రెడ్డిని పరామర్శించిన కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి అంత దౌర్భాగ్యపు, చరిత్రహీన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. పోలీసులతో ఎస్కార్ట్ ఇచ్చి ఒక ఎమ్మెల్యే ఇంటిపై దాడికి పంపుతారా? ఇదెక్కడి దుష్ట సంప్రదాయమని ప్రశ్నించారు. కేటీఆర్ శనివారం మాదాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. దాడిలో పగిలిన ఇంటి అద్దాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గాంధీ అనుచరులు కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి సంఘటనల కారణంగా జరగరానిది జరిగితే సీఎం బాధ్యత తీసుకుంటారా? కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే గాంధీని హౌస్ అరెస్ట్ చేయకుండా పోలీసులతో ఎస్కార్ట్ ఇచ్చారని మండిపడ్డారు. గాంధీ రోడ్డుపై ఫ్యాక్షన్ లీడర్‌లాగా వస్తుంటే పోలీసులు ఏమి చేస్తున్నారని నిలదీశారు. ఇదంతా రేవంత్ ఆడిన డ్రామా అని ఆరోపించారు. ఈ రకమైన గూండాగిరి హైదరాబాద్‌లో పదేండ్లలో ఎప్పుడూ లేదని, చేతగాని హోం మంత్రి, ముఖ్యమంత్రి కారణంగా ఈ పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలను కాపాడలేని రేవంత్‌కు సీఎంగా ఉండే అర్హత ఉన్నదా? అని ప్రశ్నించారు. 'ఈ నగరానికి ఏమైందంటూ పేపర్లు రాస్తున్నాయి. నెలలో 28 మర్డర్లు అయినట్టు వార్తలొచ్చాయి. హోం మంత్రి ఎవరో తెలియదు. హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్ కాపాడలేని ముఖ్యమంత్రి రేవంత్' అని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పే సత్తా లేక చిల్లర ఎత్తుగడలు, చిల్లరమాటలు, బజారుమాటలతో రాజకీయాలను దిగజారుస్తున్నారని దుయ్యబట్టారు.



ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంట్లో పగిలిన అద్దాలను పరిశీలిస్తున్న కేటీఆర్

**హైదరాబాదీలంతా మా వాళ్లే**

గత పదేండ్లలో ఏనాడూ ప్రాంతీయ తత్వంతో తాము దాడులు జరపలేదని, అభివృద్ధి, సంక్షేమం మీదనే దృష్టిపెట్టామని కేటీఆర్ చెప్పారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రజలంతా తమ వాళ్లేనని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రజలు తమను ఆశీర్వదించారని, కానీ, రేవంత్ పనికిమాలిన వ్యక్తి అనుకొని ఇక్కడి ప్రజలు ఆయనకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని చెప్పారు. అందుకే హైదరాబాద్ ప్రజలపై రేవంత్‌రెడ్డి విద్వేషం నింపుకొని, పగబట్టారని, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.

**హైకోర్టు తీర్పుతో ఆ ఎమ్మెల్యేల్లో వణుకు**

పార్టీ ఫిరాయింపులపై ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పు తర్వాత పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో వణుకు పుట్టిందని, అందుకే తాము పార్టీ మారలేదంటూ కొత్త రాగం ఎత్తుకున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన పది మంది ఎమ్మెల్యేల ఇంటికి ముఖ్యమంత్రి వెళ్లి, వారిని బతిమిలాడి, కాళ్లుమొక్కి కండువా కప్పుతున్నారని, ఒక్కొక్కరిని ఒక్కొరకంగా ప్రలోభ పెట్టి, బెదిరింపులతో పార్టీ మారేలా ఒత్తిడి చేశారని ఆరోపించారు. హైకోర్టు తీర్పు తరువాత వేటు తప్పదని గ్రహించి, తాము పార్టీ మారలేదంటూ స్వరం మార్చారని దుయ్యబట్టారు. గతంలో కాంగ్రెస్ విధానాలు నచ్చి పార్టీలో చేరానని చెప్పి, ఇప్పుడెమో బీఆర్ఎస్‌లో ఉన్నామని చెప్తున్నారని పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపులపై కోర్టులో కేసు నడిపినందునే కౌశిక్‌రెడ్డిపై కోపం పెంచుకున్నారని ఆరోపించారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేల పదవులు ఊడటం ఖాయమని చెప్పారు. హైకోర్టు తీర్పు ఇచ్చినరోజే సభా సంప్రదాయాలు, రాజ్యాంగ విలువలు, పార్లమెంటరీ పద్ధతులను తుంగలోతొక్కి గాంధీని పీఏసీ చైర్మన్‌గా ఎన్నుకోవడం కాంగ్రెస్ నీతిమాలిన విధానానికి నిదర్శనమని మండిపడ్డారు.

**బుల్లబ్బాయి, చిట్టి నాయుడు.. రేవంత్‌కు కొత్త పేర్లు**

చేతగాని సీఎం ఉండటం వల్లనే ఎమ్మెల్యే ఇంటిపై దాడి జరిగిందని కేటీఆర్ విమర్శించారు. 'రేవంత్‌రెడ్డి.. నువ్వు ముఖ్యమంత్రివేనా? అసలు నీకు అర్హత ఉన్నదా? నీలాంటి పనికిమాలిన, తలమాసిన సీఎంలను ఏనాడూ చూడలేదు. చంద్రబాబు, వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి లాంటివాళ్లతో తలపడ్డాం. వాళ్లందరి కంటే చిన్నోడివి. హైదరాబాద్‌లో నీలాంటి వారిని బుల్లబ్బాయి, చిట్టినాయుడు అని అంటారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'గాంధీ.. ఏ పార్టీలో ఉన్నావు?' అని నిలదీశారు. కౌశిక్‌రెడ్డి ఇంటి దాకా గూండాలను తీసుకొచ్చిన పోలీసులను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఎస్ఐ, ఏసీపీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ఎన్నిరకాల డైవర్షన్ గేమ్‌లు ఆడినా, హెడ్‌లైన్ మేనేజ్‌మెంట్‌లు చేసినా.. ఆరు గ్యారెంటీలు, రుణమాఫీపై ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టంచేశారు.

**కార్యకర్తలకు అండగా ఉంటాం**

బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల మీద దాడులు చేయిస్తున్నది ముఖ్యమంత్రేనని కేటీఆర్ ఆరోపించారు. ఏ కార్యకర్తకు ఏ చిన్న హాని జరిగినా పార్టీ మొత్తం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హరీశ్‌రావు సహా పలువురు నేతలను మొన్న పోలీసులు అరెస్ట్ చేసిన సందర్భంలో బీఆర్ఎస్ బలగం పవరేమిటో చూపించారని చెప్పారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రభుత్వానికి చుక్కలు చూపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, మాధవరం కృష్ణారావు, అనిల్‌జాదవ్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గణేశ్‌గుప్తా, బాల్క సుమన్, బీఆర్ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, కే వాసుదేవరెడ్డి, మన్నె గోవర్ధన్‌రెడ్డి, పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

**దమ్ముంటే రాజీనామా చేయండి**

'పార్టీ మారిన ఎమ్మెల్యేలు దమ్ముంటే రాజీనామా చేయండి.. ప్రజాక్షేత్రంలోకి రండి.. రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీకి దమ్ముంటే వారితో రాజీనామా చేయించాలి' అని కేటీఆర్ సవాలు చేశారు. రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులపై ఏం మాట్లాడారో గుర్తు చేసుకోవాలని సూచించారు. 'రాళ్లతో కొట్టి చంపండి, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల ఇంటి ముందట చావు డప్పు కొట్టిస్తాం. వారిని ఉరితీయాలి' అంటూ రేవంత్ మాట్లాడారని చెప్పారు.

**లోకం పోకడ**




## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 37.4°c | 21.7°c |
| రంగారెడ్డి | 34.5°c | 18.6°c |
| మెదక్ | 33.4°c | 21.0°c |
| ఖమ్మం | 33.0°c | 23.0°c |
| వరంగల్ | 32.0°c | 24.0°c |
| కరీంనగర్ | 32.0°c | 24.0°c |
| మహబూబ్‌నగర్ | 32.0°c | 21.0°c |
| నిజామాబాద్ | 31.8°c | 23.6°c |
| నల్లగొండ | 31.0°c | 24.8°c |
| హైదరాబాద్ | 30.8°c | 23.0°c |

## ఆయిల్‌పామ్ రైతులకు మంచిరోజులు

**పామాయిల్ దిగుమతి సుంకాన్ని పెంచిన కేంద్రం**
**5.5 నుంచి 27.5 శాతానికి పెంచుతూ నిర్ణయం**
**కేసీఆర్ ముందుచూపుతో సాగుకు ప్రోత్సాహం**

హైదరాబాద్, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ): ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు భారీ ఊరట లభించింది. పామాయిల్ దిగుమతిపై సుంకాన్ని భారీగా పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకున్నది. ఇప్పటి వరకు ఉన్నటువంటి 5.5 శాతం సుంకాన్ని ఏకంగా 27.5 శాతానికి పెంచింది. దీంతో పామాయిల్ దిగుమతులు తగ్గి.. స్థానికంగా రైతులు పండించే ఆయిల్‌పామ్ గెలల ధర పెరిగే అవకాశం ఉంటుంది. తద్వారా ఆయిల్‌పామ్ సాగు లాభసాటిగా మారనుంది. పామాయిల్‌పై దిగుమతి సుంకం పెంచడం వల్ల ప్రస్తుతం టన్నుకు రూ. 14,392గా ఉన్న ఆయిల్‌పామ్ గెలల ధర కనీసంగా రూ. 16,500 పైగా ధర పలికే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 2.03 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులో ఉంది. ఇందులో 44,400 ఎకరాల ఆయిల్ పామ్ పంటల నుంచి 2.80 లక్షల టన్నుల ఆయిల్ పామ్ గెలల దిగుబడి వస్తున్నది. ఈ నేపథ్యంలో దిగుమతి సుంకం పెంచడం వలన 9,366 మంది ఆయిల్ పామ్ రైతులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. పామాయిల్ దిగుమతి సుంకం పెంపుపై కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌కు రాష్ట్ర మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. గతంలో దిగుమతి సుంకం పెంచాలని కోరుతూ మంత్రి తుమ్మల కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడంతోపాటు ఓసారి రాష్ట్రానికి వచ్చిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఇప్పుడు సుంకం పెంపు నేపథ్యంలో ఈ అవకాశాన్ని రాష్ట్ర రైతులు సద్వినియోగం చేసుకుని, భారీగా పామ్ ఆయిల్ సాగు చేయాలని మంత్రి కోరారు.

**కేసీఆర్ ముందుచూపు**

మాజీ సీఎం కేసీఆర్ ముందుచూపుతో తెలంగాణ రైతులకు సాగు లాభసాటిగా మారింది. అంతర్జాతీయంగా పామాయిల్‌కు గల డిమాండ్‌ను గుర్తించిన కేసీఆర్ తెలంగాణ పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ సాగుకు ప్రణాళికలు రూపొందించారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు క్రమం తప్పకుండా భారీ ఆదాయం సమకూరుతుందని పదే పదే చెప్పారు. ఇందుకు అనుగుణంగా ఐదేండ్ల ప్రణాళికను తయారు చేసి ఏకంగా 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగయ్యేలా చర్యలు తీసుకున్నారు. కేసీఆర్ తీసుకున్న చర్యలతో రాష్ట్రంలో 30వేల ఎకరాల్లో మాత్రమే సాగులో ఉన్నటువంటి ఆయిల్‌పామ్‌ను ఏకంగా 2.03 లక్షల ఎకరాలకు పెంచారు. ఇప్పుడు దిగుమతి సుంకం పెంపుతో రాష్ట్రంలో ఆయిల్‌పామ్ గెలల ధర భారీగా పెరిగే అవకాశం ఉంది. నాడు కేసీఆర్ తీసుకున్న ముందుచూపు నిర్ణయంతో నేడు రైతులకు ఆయిల్‌పామ్ సాగు లాభాల సాగు మారనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ధర్నా చేసుకోండి.. అద్దాలు పగలగొట్టండి

మొదటిపేజీ తరువాయి...

వర్తింపజేసినా, టిమ్స్‌లోని సిబ్బందికి వర్తింజేయలేదని, తమకు సైతం పీఆర్సీ అమలుచేయాలని కోరారు. తమ వయసు, సర్వీసును పరిగణనలోకి తీసుకుని రెగ్యులర్ స్టాఫ్‌నర్సుల రిక్రూట్‌మెంట్‌లో తమకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆ వినతులన్నింటినీ మంత్రి తోసిపుచ్చారు. దీంతో తమ సమస్యలను మరింత వివరంగా మంత్రి తెలియజేసేందుకు స్టాఫ్‌నర్సులు ప్రయత్నించారు. దీంతో మంత్రి వారిపై అసహనం వ్యక్తం చేశారు. 'అన్యాయం జరిగితే కోర్టుకు వెళ్లండి.. అవసరమైతే ధర్నా చేసుకోండి.. అద్దాలు పగలగొట్టండి' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. లోపలికి రానిచ్చి మాట్లాడటమే తప్పయిందని, వెంటనే వెళ్లిపోవాలంటూ సీరియస్ అయ్యారు. దీంతో టిమ్స్ యూనియన్ స్టాఫ్‌నర్సులు నిర్ఘాంతపోయారు. మంత్రి చులకనగా మాట్లాడటంతో కన్నీటిపర్యంతమవుతూ అక్కడినుంచి వెనుదిరిగారు. తక్షణమే దామోద రాజనర్సింహను మంత్రి పదవి నుంచి తొలగించాలని టిమ్స్ యూనియన్ స్టాఫ్‌నర్స్ అండ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ డిమాండ్ చేసింది.

# మేఘాకే కొడంగల్ లిఫ్ట్!

మొదటిపేజీ తరువాయి...

నిర్ణయించింది. మొదటి ప్యాకేజీలో పంచ్‌దేవ్‌పహడ్, భూత్పూర్ పంపింగ్‌స్టేషన్ల నిర్మాణం, ఊట్కూరు, జయమ్మ, కానుకుర్తి తదితర చెరువుల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అందుకు రూ.1,134.62 కోట్లు అవసరమని అంచనా వేశారు. రెండో ప్యాకేజీలో ఊట్కూరు, కానుకుర్తి పంపింగ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టనున్నారు. అందుకు 1,126.23 కోట్లు అవసరమని అంచనా వేశారు. మొత్తంగా పంపింగ్ సిస్టమ్ కోసమే 2,260.85 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఇవికాక రెండో దశలో జాజాపూర్, దౌలతాబాద్, బొమ్రాస్‌పేట, లక్ష్మీపూర్, ఎర్లపల్లి, హుస్నాబాద్, కొడంగల్ చెరువుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు గ్రావిటీ కాల్వలు, ఆయకట్టుకు నీటిని అందించే డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణం, రూ.3 వేల ఎకరాల భూసేకరణ తదితర పనులకు మరో రూ.1,404.50 కోట్లు అవసరమని ఇరిగేషన్ శాఖ అంచనా వేసింది. ఇటీవల ఈ రెండు ప్యాకేజీలకు సంబంధించిన పనులకు ఇరిగేషన్ శాఖ టెండర్లు ఆహ్వానించింది. ఇటీవలనే టెండర్లను తెరిచారు. ఇందులో మొదటి ప్యాకేజీ పనులను రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ, రెండో ప్యాకేజీ పనులను మేఘా ఇంజినీరింగ్ కంపెనీ దక్కించుకున్నాయి. ఆయా పనుల అంచనా వ్యయం కంటే 3.95% అధికంగా కోట్ చేయడం గమనార్హం.

**టెక్నికల్ ఎవాల్యూయేషన్‌పై ఆరోపణలు**

ఎన్‌కేఎల్ఐఎస్ ప్యాకేజీ పనుల అప్పగింతకు నిర్వహించిన టెండర్ల ప్రక్రియపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మేఘా, రాఘవ కంపెనీలకు టెండర్లను కట్టబెట్టేందుకే టెక్నికల్ ఎవాల్యూయేషన్‌ను సరిగా నిర్వహించలేదని, కావాలనే మరో రెండు కంపెనీలను తప్పించారనే ఆరోపణలున్నాయి. ఈ పనుల కోసం ఎల్అండ్‌టీ, ఎన్‌సీసీ (నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ) సైతం బిడ్లను దాఖలను చేశాయి. వారం రోజుల క్రితం తొలుత టెక్నికల్ బిడ్లను తెరిచారు. అందులో నాలుగు కంపెనీలూ అర్హతను సాధించాయి. దీంతో ప్రైస్ బిడ్లను తాజాగా తెరిచారు. ఇందులో మేఘా, రాఘవ కంపెనీలే అర్హత సాధించాయి. మిగిలిన రెండు కంపెనీలు అర్హతను సాధించలేదని అధికారులు చెప్తున్నారు. సాధారణంగా టెక్నికల్ ఎవాల్యూయేషన్ చేసేటప్పుడు ఆయా కంపెనీల ట్రాక్ రికార్డును పరిశీలిస్తారు. గతంలో కంపెనీ చేపట్టిన నిర్మాణాలు, అందులో వైఫల్యాలు, ప్రమాదాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఆ నిబంధనలను సక్రమంగా అమలు చేసి ఉంటే మేఘా కంపెనీకి టెక్నికల్‌గా అర్హత సాధించే వీలే ఉండదని, ప్రాథమికంగానే తిరస్కరించాల్సి ఉంటుందని ఇంజినీరింగ్ నిపుణులు చెప్తున్నారు. మేఘా కంపెనీ నిర్మిస్తున్న సుంకిశాల ప్రాజెక్టులో ఇటీవల టన్నెల్ గేట్ ధ్వంసం కావడంతోపాటు రిజర్వాయర్ వైపు ఉన్న సైడ్‌వాల్ (రక్షణ గోడ) కూలిపోయింది. దీంతో సంపు, పంప్‌హౌజ్ సూపర్‌స్ట్రక్చర్ నిర్మాణాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ ప్రమాద ఘటనకు పూర్తి బాధ్యత తమదేనని నిర్మాణ సంస్థ మేఘా సైతం అంగీకరించింది. వాటర్‌బోర్డు జారీచేసిన షోకాజ్ నోటీసులకు ఈ మేరకు మేఘా కంపెనీ బదులిచ్చింది. అయినప్పటికీ ప్రస్తుతం ఎన్‌కేఎల్ఐఎస్ టెండర్ల ఖరారులో సుంకిశాల ప్రమాద ఘటనను పరిగణనలోకి తీసుకోలేదని, మేఘా కంపెనీకి కట్టబెట్టేందుకు టెక్నికల్ ఎవాల్యూయేషన్ నిబంధనలను తుంగలో తొక్కారనే ఆరోపణలున్నాయి.

**ముందే చెప్పిన 'నమస్తే తెలంగాణ'**

**నారాయణపేట-కొడంగల్** ఎత్తిపోతల పథకం (ఎన్‌కేఎల్ఐఎస్) పనులు మేఘా కంపెనీకే దక్కనున్నాయని, అందుకు అనుగుణంగా ముందస్తుగానే ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని 'నమస్తే తెలంగాణ' ఆది నుంచీ చెప్తున్నది. ఇదే విషయమై ఆగస్టు 18న 'మేఘా చేతికే కొడంగల్ 'పేరిట ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఇప్పుడు ఒక ప్యాకేజీ పనులను ఆ కంపెనీయే దక్కించుకోవడం గమనార్హం. ఎన్‌కేఎల్ఐఎస్‌కు గతంలోనే ప్రతిపాదనలు సిద్ధంచేశారు. అందులో అప్పుడున్న భూగర్భ సొరంగాల స్థానంలో ఇప్పుడు ప్రెషర్‌మెయిన్స్ ద్వారా నీటిని తరలించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. మేఘా కంపెనీకి ప్రాజెక్టు పనులను అప్పగించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని ఇరిగేషన్‌శాఖ అధికారులు చర్చించుకుంటున్నారు. వాస్తవంగా భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నీటిని లిఫ్ట్ చేసి సొరంగాల ద్వారా తరలించాల్సి ఉంటుంది. ఇందుకు దాదాపు 38 కిలోమీటర్ల పొడవు సొరంగాలను తవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం భూగర్భ సొరంగాలకు బదులుగా ప్రెషర్‌మెయిన్స్ ద్వారా నీటిని లిఫ్ట్ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. భూసేకరణ, జియోలజికల్ అధ్యయనాలు, సొరంగాలకు అడ్డుగా ఉండే రాళ్లు, బండల కటింగ్‌కు ఎక్కువ సమయం పడుతుందని, రైతులకు సాగునీటిని సత్వరమే అందించేందుకు ప్రెషర్ మెయిన్ నిర్మించాలని నిర్ణయించినట్టు ప్రభుత్వం చెప్తున్నది. ప్రభుత్వ వాదన వట్టిదేనని ఇంజినీరింగ్ నిపుణులు చెప్తున్నారు. ప్రెషర్‌మెయిన్స్‌తో ప్రాజెక్టును చేపట్టినా దాదాపు మూడేండ్ల సమయం పడుతుందని ఇంజినీర్లు వివరిస్తున్నారు. మోటర్లు రావడానికి, పంప్‌హౌజ్‌ల నిర్మాణం, మోటర్ల బిగింపునకు దాదాపు రెండున్నరేండ్లు పడుతుందని, ఆ సమయంలో ఇప్పుడున్న సాంకేతిక టెక్నాలజీ ఆధారంగా భూగర్భ సొరంగాల తవ్వకాన్ని పూర్తి చేయొచ్చని వివరిస్తున్నారు. సొరంగాల నిర్మాణం చేపడితే దీర్ఘకాలంపాటు మెయింటనెన్స్ ఉండబోదని, కానీ ప్రెషర్స్‌మెయిన్స్‌తో అదనంగా మెయింటనెన్స్ భారం పడుతుందని వెల్లడిస్తున్నారు. సొరంగాల ద్వారా పంపింగ్ సిస్టమ్‌ను పూర్తిచేయడానికి రూ.963.898 కోట్లు అవసరమవుతాయని, ప్రెషర్‌మెయిన్స్ ద్వారా ఆ ఖర్చు 1,016.572 కోట్లుకు పెరుగుతుందని తెలిపారు. మొత్తంగా ప్రెషర్ మెయిన్స్ ద్వారా లిఫ్ట్‌ను చేపడితే ప్రాజెక్టు వ్యయం దాదాపు రూ.60 కోట్లు అదనంగా పెరగనున్నది. ఏటా మెయింటెనెన్స్ చార్జీలు అదనపు భారం కానున్నాయి.

**ముందే కూడబలుక్కున్నారా?**

**ఎన్‌కేఎల్ఐఎస్** ప్యాకేజీ పనులను దక్కించుకున్న రాఘవ కన్‌స్ట్రక్షన్, మేఘా కంపెనీలు ముందే కూడబలుక్కుని, లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.1,134.62 కోట్లతో చేపట్టాల్సిన ప్యాకేజీ-1 పనులకు రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ అంచనా వ్యయం కంటే 3.95% అధికంగా కోట్ చేసింది. అదే పనులకు మేఘా ఇంజినీరింగ్ కంపెనీ 4.85% అధికంగా కోట్ చేసింది. దీంతో ఎల్1గా నిలిచిన రాఘవ కంపెనీకి ప్యాకేజీ-1 టెండర్ దక్కింది. రూ.1,126.85 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ప్యాకేజీ-2 పనులకు మేఘా ఇంజినీరింగ్ 3.95% అధికంగా కోట్ చేయగా, రాఘవ కంపెనీ 4.8% అధికంగా కోట్ చేసింది. దీంతో ఎల్-1గా నిలిచిన మేఘా ఇంజనీరింగ్ కంపెనీకి ప్యాకేజీ-2 టెండర్ దక్కింది. మేఘా కంపెనీ అధికంగా కోట్ చేసిన చోట రాఘవ కంపనీ తక్కువగా కొటేషన్ దాఖలు చేయడం, మేఘా కంపెనీ తక్కువ కోట్ చేసిన చోట రాఘవ కంపెనీ అధికంగా కొటేషన్ దాఖలు చేయడం లోపాయకారి ఒప్పందంలో భాగమేనని ఇరిగేషన్ శాఖలో చర్చించుకుంటున్నారు. రూ.1,134.62 కోట్ల విలువైన పనులకు 3.9% అధిక కొటేషన్ దాఖలు చేసిన రాఘవ కంపెనీ, అంతకంటే రూ.1126.85 కోట్ల విలువైన ప్యాకేజీ-2 పనులకు మాత్రం 4.8% అధికంగా కోట్ చేయడం గమనార్హం.

**మంత్రి స్వయంగా పట్టుబట్టి..!**

ఎన్‌కేఎల్ఐఎస్‌కు సంబంధించిన రెండు ప్యాకేజీల పనులను మేఘా కంపెనీకే అప్పగించాలని ప్రభుత్వ పెద్దలు ముందుగా నిర్ణయించినట్టు సమాచారం. ఇరిగేషన్ అధికారులు సైతం అంతా ఇదే అనుకున్నారు. కానీ ఊహించని రీతిలో రాఘవ కంపెనీ సైతం ఒక ప్యాకేజీ పనులను దక్కించుకున్నది. రాఘవ కంపెనీ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రక్తసంబంధీకులదే. దీంతో మంత్రి పట్టుబట్టి తమవారి కంపెనీకి పనులు దక్కేలా చివరి నిమిషంలో చక్రం తిప్పారని కాంగ్రెస్‌పార్టీ నేతలతోపాటు ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు చర్చించుకుంటున్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా ఆవంచలోని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

## బ్లాక్‌లిస్ట్ చేయకుండా పనులా?

మొదటిపేజీ తరువాయి...

పనులు మేఘా ఇంజినీరింగ్ కంపెనీకి, మరో సగం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ సంస్థకు అప్పగించారని విమర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి ఇటీవల మృతి చెందగా శనివారం మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి కేటీఆర్ గ్రామానికి వెళ్లి పరామర్శించారు. శ్వేతారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించి లక్ష్మారెడ్డిని, కుటుంబసభ్యులకు ఓదార్చారు. అనంతరం నేరెళ్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. సుంకిశాల ప్రాజెక్టు ప్రమాదంతో దాదాపుగా రూ.80 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందని, ఇందుకు కారణమైన మేఘా సంస్థకు రూ.4,350 కోట్ల విలువైన కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఎలా అప్పజెప్పారని ప్రశ్నించారు. ఈ సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టాలని కోరారు. నీ సొంత నియోజకవర్గంలో పనులను.. ఏ కంపెనీ అయితే ఈస్ట్ ఇండియా కంపెనీ అన్నావో.. అదే మేఘా కంపెనీకి అప్పగిస్తుంటే నీ నైజం, రంగు, నిజాయితీ ఏమిటో ప్రజలకు తెలుసున్నదని వ్యాఖ్యానించారు. బ్లాక్‌లిస్టులో పెట్టాల్సిన మేఘా సంస్థకు ఏం ఆశించి పనులు ఇచ్చావో చెప్పాలని డిమాండ్ చేశారు.

**'పాలమూరు'ను పూర్తి చేస్తరా? లేదా?**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ప్రభుత్వం ఎందుకు నిధులు ఇవ్వడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను 95% పూర్తి చేసిందని, కాంగ్రెస్ సర్కార్ ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. 'పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తరా? లేదా? పనులు పూర్తి చేసి ప్రారంభిస్తే కేసీఆర్‌కు మంచి పేరొస్తుందనా? ఈ ప్రాజెక్టుకు డబ్బులివ్వడానికి మనసొస్తలేదా? నీ బాధేంది? నీ భయమేంది?' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ ప్రశ్నించారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు అందించిందని వివరించారు. కేసీఆర్ సీఎంగా ఉన్న కాలంలోనే నార్లాపూర్‌లో నీటి పంపింగ్ ప్రారంభించామని గుర్తుచేశారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిపోయిన పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నదని ధ్వజమెత్తారు. కేవలం 5% భూసేకరణ పనులు మిగిలాయని పేర్కొన్నారు. ఈ పనులకు సైతం బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు పిలిస్తే, కాంగ్రెస్ వాటిని రద్దు చేసిందని ఆరోపించారు. కొల్లాపూర్ నుంచి షాద్‌నగర్ దాకా అన్ని పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు పూర్తయితే సాగునీరు పారుతుందని చెప్పారు.అలాంటి ప్రాజెక్టును ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. నిజంగా పాలమూరు బిడ్డవైతే సమాధానం చెప్పాలని సీఎంకు సవాలు చేశారు. మేడిగడ్డకు వెళ్లినవిధంగానే రెండ్రోజులపాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని బీఆర్ఎస్ నాయకత్వమంతా కలిసి కేసీఆర్ కట్టించిన రిజర్వాయర్లు, పంపుహౌజ్‌లను ప్రజలకు చూపిస్తామని వెల్లడించారు. ఈ యాత్ర ద్వారా ముఖ్యమంత్రి కొడంగల్ ప్రాజెక్టుకు పైసలు ఖర్చు చేస్తూ, పాలమూరు ఎత్తిపోతల పనులను ఎలా ఎండబెడుతున్నారో తెలియజేస్తామని చెప్పారు.

**పేదల గూడును చెదరగొడ్తవా?**

**పాలమూరు** బిడ్డనని చెప్పుకొనే సీఎం రేవంత్‌రెడ్డి అదే జిల్లా ఆదర్శనగర్‌లో 75 మంది దళితులు, పేదల ఇండ్లను బుల్డోజర్లతో నేలమట్టం చేయించారని కేటీఆర్ విమర్శించారు. 2007లో వైఎస్సార్ ఇచ్చిన ఇండ్లను కూలగొట్టడానికే నేడు సీఎం అయ్యావా? అని ప్రశ్నించారు. పేదల ఇండ్లను కూల్చిన సంఘటనపై బాధితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో పాలమూరులో నాలుగువేల డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించగా, ఇంకా రెండుమూడొందల ఇండ్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని కూల్చివేత బాధితులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏ కారణంతో పేదల ఇండ్లను కూలగొట్టారో వివరించాలని, ఈ చర్యలకు పాల్పడిన అధికారులను సస్పెండ్ చేస్తారో, ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని డిమాండ్ చేశారు.